సాక్షి తిరుపతి

శనివారం । 10 । మే । 2025



అందరూ గుర్తున్నారు..

'అందరూ గుర్తున్నారు.. ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కర్నీ వదిలిపెట్టను' అని శ్రీకాళ హస్తి మాజీ ఎమ్మెల్యే హెచ్చరించారు. - 12లో



భూసేకరణ వేగవంతం

వైజాగ్- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణ పెండింగ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. - 12లో



అడవికి నిప్పు

చిట్టమూరు పంచాయతీ, కలగుర్తిపాడు గ్రామ సమీపంలోని రిజర్వు ఫారెస్ట్‌కు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. - 12లో

న్యూస్‌రీల్

కక్ష సాధింపు చర్యలు మంచి పద్ధతి కాదు



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై ప్రశ్నిస్తున్న సాక్షి పత్రికపై కక్ష సాధింపు చర్యలు మంచి పద్ధతి కాదని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై కేసులు నమోదు చేయడం, ఇంట్లో అక్రమ సోదాలు వంటి అప్రజాస్వామ్యకమైన చర్యలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. సాక్షి దినపత్రిక గొంతు నొక్కే ప్రయత్నంగా ఏడిటర్‌పై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు అర్థమవుతోందని చెప్పారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు గడువు నేటితో ఆఖరు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకోవడానికి శనివారంతో గడువు ముగుస్తుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వర్చువల్ పద్ధతిలో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ నెల 20వ తేదీకల్లా అర్హులైన వారికి రుణాలు ఇవ్వాన్నారు. ఇప్పటి వరకు 1,267 యూనిట్లకు 5,600 దరఖాస్తులు వచ్చాయన్నారు. మొత్తం రూ.53 కోట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఇందులో సబ్సిడీ రూ.21 కోట్లని పేర్కొన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చెన్నయ్య పాల్గొన్నారు.

రేపటితో ఏపీ పీజీసెట్ దరఖాస్తుకు ఆఖరు



ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలిస్తున్న సిబ్బంది

తిరుపతి సిటీ: ఏపీ పీజీసెట్-2025 దరఖాస్తుల స్వీకరణ గడువు ఆదివారంతో ముగియనుంది. ఈనెల 5వ తేదీతో ముగిసిన గడువును విద్యార్థుల అభ్యర్థన మేరకు ఆ నెల 11వ తేదీ వరకు పొడిగించారు. అలాగే రూ.1000 అపరాధరుసుముతో ఈనెల 15వ తేదీ వరకు, రూ.2 వేలు అపరాధ రుసుముతో 20 వరకు, రూ.4వేల అపరాధ రుసుముతో 24వ తేదీ వరకు, రూ.5 వేల అపరాధ రుసుముతో 25వ తేదీవరకు అవకాశం ఉంటుందని కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా ఏపీపీజీ సెట్‌కు 24 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 64,850 మంది స్వామివారిని దర్శించుకోగా 28,816 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కొండంత భద్రత

తిరుమలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. 130 మంది ఆక్టోపస్, పోలీసు, టీటీడీ నిఘా విభాగం తదితర సిబ్బందితో పహరా కాస్తున్నారు. - తిరుమల



నిఘా నీడలో షార్

సూళ్లూరుపేట: భారత్-పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో షార్ రాకెట్ కేంద్రంలో భద్రత కట్టుదిట్టం చేశారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు పహరా కాస్తున్నారు. సీఐఎస్ఎఫ్ సిబ్బందికి సెలవులు లేకుండా షార్ కేంద్రానికి అన్ని వైపుల నుంచి భద్రతను మరింత పటిష్టం చేశారు. తూర్పున బంగాళాఖాతం పడమరవైపు పులికాట్ సరస్సుకు మధ్యన సుమారు 43,360 ఎకరాలు (175 చ.కి) విస్తరించి ఉన్న షార్ కేంద్రంలో రెండు ప్రయోగవేదికలు, ఘన ఇంధన తయారీ ప్లాంట్‌లతో పాటు పలు కీలకమైన విభాగాలున్నాయి. ఈ రాకెట్ కేంద్రానికి సుమారు 1000 మంది భద్రతా సిబ్బంది పహరాలో ఉన్నారు. శ్రీహరికోట దీవి చుట్టూరా సుమారు 25 దాకా గస్తీ పాయింట్లు వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సముద్రం వైపు నుంచి నిరంతరం నిఘా పెంచారు. శ్రీహరికోటకు ఉత్తరం వైపు భాగంలో నవాబుపేట వద్ద, దక్షిణ భాగంలో పల్‌వేరికాడ్ వద్ద భద్రతా సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం మెరైన్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని కూడా అప్రమత్తం చేశారు.



షార్ కేంద్రంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది

కళ తప్పిన జాతర!

దప్పు వాయిద్యాలు..యువకుల కేరింతలు.. కళాకారుల నృత్యాలు.. నగరం చుట్టూ వేపాకు తోరణాలు.. చలువ పందిళ్లు.. డివిజన్లలో అమ్మవారి ప్రతిమలు.. అబ్బో.. తిరుపతి తాతయ్యగుంట గంగజాతరంటే రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు సరిహద్దుల్లోని మరో రెండు రాష్ట్రాల్లో పేరు మార్మోగేది. దానికి తగ్గట్టే భారీ ఏర్పాట్లు చేపట్టేవారు. గత ఏడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించి అంగరంగ వైభవంగా నిర్వహించింది. కానీ ఈ యేడు జాతర తుస్సుమంటోంది. సడి..సందడి లేకుండా సాగుతోంది. కూటమి నేతలు అధికారం కోసం పాకులాడడం తప్ప జన జాతరపై దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- జానపద కళాకారులు.. ఆ వేషాలు ఎక్కడ నాయకా?
- వేపాకు తోరణాలు లేవు.. డివిజన్‌కో అమ్మవారి విగ్రహం లేదు
- నాడు రోజూ ప్రతి డివిజన్ నుంచి అమ్మవారికి సారె
- నేడు కనిపించని నాటి సందడి..
- కమిటీలపై ఉన్న శ్రద్ధ తిరుపతి గంగ జాతరపై లేదా?



ప్రస్తుతం జాతర చాటింపు ముందు రోజు అలంకరణ ఇలా..

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుపతి తాతయ్యగుంట గంగ జాతరంటే.. అందో పెద్ద పండుగ. వారం రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ జాతరను చూసేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గంగ జాతర గురించి రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. తమిళనాడు, కర్ణాటక నుంచి వచ్చిన వారు కూడా ప్రత్యేకంగా చర్చించుకున్నారు. నాటి తాతయ్యగుంట గంగమ్మ జాతరకు.. నేడు నిర్వహిస్తున్న గంగ జాతరకు ఎంతో తేడా కనిపిస్తోంది. ఆ నాటి సందడి నేడు కనిపించకపోవడంతో నగర ప్రజలే కాదు.. జాతరకొచ్చే వారంతా ఔరా..! అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

ప్రతి ఏటా మేలో తిరుపతిలో నిర్వహించే తాతయ్యగుంట గంగ జాతరకు ఎంతో విశిష్టత ఉంది. తొమ్మిది వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ జాతరకు పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చింది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. రాష్ట్ర పండుగగా గుర్తించి.. రాష్ట్ర ముఖ్యమంత్రే వచ్చి అమ్మవారికి సంప్రదాయ పద్ధతిలో సారె సమర్పించారు. ఇంకా ప్రముఖ పీఠాధిపతులు కూడా తిరుపతికి విచ్చేసి జాతర ప్రాశస్త్యం గురించి తెలియజేశారు.



గత ఏడాది జాతర సందర్భంగా భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో ఊరేగింపుగా సారె తీసుకెళ్తున్న నేతలు

శోభాయాత్ర అదో అద్భుతం

చాటింపు మరుసటి రోజు తిరుమల యాత్రకు ముఖద్వారమైన అనంత వీధి నుంచి శోభాయాత్ర నిర్వహించేవారు. ఈ యాత్రలో 150 కళాబృందాలు.. 1,400 మంది కళాకారులు పాల్గొనేవారు. యాత్ర వస్తుంటే.. నగరంలోని ప్రతి గడప ముందు కల్లాపు చల్లి, ముగ్గులు వేసి, పసుపు నీటితో స్వాగతం పలికేవారు.

వారం రోజుల పాటు జాతరే జాతర

చాటింపు రోజు నుంచి జాతర ముగిసే వరకు నగరంలోని ప్రతి డివిజన్‌లో సందడి కనిపించేది. ప్రతి డివిజన్‌లో అమ్మవారి విగ్రహాలు ఏర్పాటు చేసి విచిత్ర వేషధారణలతో మొక్కులు చెల్లించుకునేవారు. గంగమ్మ తల్లిని నగర వాసులు ఇంటి ఆడబిడ్డగా భావించడంతో 50 డివిజన్ల నుంచి స్థానికులు ఉదయం, సాయంత్రం ఊరేగింపుగా సారె తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించేవారు.

నాడు శ్రీవారి బ్రహ్మోత్సవాలను తలపించేలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలను తలపించేలా తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతరను నిర్వహించారు. అందులో భాగంగా జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి అంగరంగ వైభవంగా చేపట్టారు. జాతర నిర్వహణ కోసం నాడు ప్రభుత్వమే టీటీడీ నుంచి రూ.50 లక్షలు, కార్పొరేషన్ ద్వారా రూ.25 లక్షలు, తుడా నుంచి రూ.25 లక్షలతో పాటు సాంస్కృతిక శాఖ ద్వారా రూ.10 లక్షలు ఇప్పించింది. అందుకు తగ్గట్టే బ్రహ్మాండంగా ఏర్పాట్లు చేశారు. చాటింపునకు ముందే తిరుపతి నగరమంతా వేపాకు తోరణాలు.. ఫ్లెక్సీలతో జాతరకు ఆహ్వానం పలికారు. నగరమంతా మైక్‌సెట్లు ఏర్పాట్లు చేసి జాతర విశేషాలు, గోవిందనామ స్మరణలు వినిపించేలా ఏర్పాట్లు చేశారు.

లక్ష కుంకుమార్చనేదీ?

చాటింపు తర్వాత వచ్చే శుక్రవారం లక్ష కుంకుమార్చని నిర్వహించే కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గత ఏడాది భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో గంగమ్మ ఆలయంలో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఆ కుంకుమను ప్యాకెట్లలో పెట్టి వలంటీర్ల ద్వారా ప్రతి నివాసానికీ అందజేశారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న జాతరలో లక్ష కుంకుమార్చన ఊసే లేకుండా పోయింది.



గత ఏడాది గంగ జాతర సందర్భంగా తిరుపతి శోభాయాత్ర

కమిటీలపై ఉన్న శ్రద్ధ జాతరపై లేదే?

జాతర కోసం ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీలో చోటు కోసం జాబితాలను మార్చి మార్చి తన అనుచరులను నియమించారు. ఈ కమిటీలో చోటుకోసం కూటమి నేతలు పోటీలు పడి జిల్లా కలెక్టర్‌పై ఒత్తిడిచేసి ప్రకటించిన జాబితాను మూడు సార్లు మార్పించారు. ఇంత చేసినా.. జాతర్పై ఏ ఒక్కరికీ శ్రద్ధ లేదు. కమిటీలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నేతలు ఉన్నా జాతర ఏర్పాట్ల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. అధికారం కోసం ఆరాటం తప్ప జాతర గురించి పట్టించుకునే నాథుడు కరువయ్యారని స్థానికులు మండిపడుతున్నారు.

గంగమ్మా.. కాపాడమ్మా!

- గంగమ్మకు సారె సమర్పించిన భూమన అభినయ్‌రెడ్డి



అమ్మవారి సేవలో భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: తిరుపతి శ్రీతాతయ్యగుంట గంగమ్మ తల్లికి వైఎసార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి శుక్రవారం సంప్రదాయబద్ధంగా సారెను సమర్పించారు. ఆలయ మహద్వారం నుంచి పసుపు, కుంకుమ, గాజులు, పట్టు వస్త్రాలతో కూడిన సారెను నెత్తిన పెట్టుకొని ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుపతి గ్రామదేవత గంగమ్మ తల్లి జాతరకు ఎంతో విశిష్టత ఉందన్నారు. సాక్షాత్తు తిరుమల శ్రీవారి చెల్లెలుగా విరాజిల్లుతూ కోరిన వారి కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ఖ్యాతిగడించిందని తెలిపారు. వైఎస్ఆర్‌సీపీ నగర అధ్యక్షుడు మల్లం రవి చంద్రారెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, గంగమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కట్టా గోపీ యాదవ్, నాయకులు శేఖర్‌రాయల్, తొండమనాటి వెంకటేశ్వర్‌రెడ్డి, తులసీయాదవ్, నల్లానిబాబు, దినేష్ రాయల్, గీతాయాదవ్, పద్మజ పాల్గొన్నారు.

లాసెట్‌కు 25 వరకు గడువు



వీసీ ప్రొఫెసర్ ఉమ

తిరుపతి సిటీ: ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు లాసెట్-2025-26 పరీక్ష నిర్వహణ పద్మావతి మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో జరగనుందని, ఇప్పటి వరకు 26,341 దరఖాస్తులు అందాయని లాసెట్ చైర్మన్, వీసీ ప్రొఫెసర్ ఉమ తెలిపారు. లాసెట్ పరీక్ష నిర్వహణ, దరఖాస్తుల స్వీరణపై ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. లాసెట్ దరఖాస్తుల గడువు ముగిసిందని, రూ.2వేలు అపరాధ రుసుముతో ఈనెల 11 వరకు, 12 నుంచి రూ.4 వేలు ఫైన్‌తో ఈనెల 18 వరకు, రూ.10 వేల అపరాధ రుసుముతో ఈనెల 19 నుంచి 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఐసెట్ పరీక్షను జూన్ 5వ తేదీన నిర్వహించనున్నట్టు తెలిపారు.

రేషన్ కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: 11 నెలల తర్వాత కూటమి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులకు పచ్చజెండా ఊపింది. గ్రామ, వార్డు సచివాలయాలు కేంద్రంగా దరఖాస్తులు స్వీకరించనుంది. కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకునే వారితోపాటు బియ్యం కార్డులో సభ్యుల విభజన, పేర్లు చేర్పులు, తొలగింపులు, కార్డులు సరెండర్ చేయడం, చిరునామా మార్పులు, ఆధార్ సీడింగ్ దిద్దుబాటుకు సంబంధించి ఏడు అంశాలకు అవకాశం కల్పించింది. ఈ సమస్యలున్న వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు.



రూల్స్ ఇవీ

రూరల్ ప్రాంతాల్లో నెలకు ఆదాయం రూ.10 వేల లోపు, అర్బన్ ప్రాంతాల్లో నెలకు రూ.12 వేలు లోపు, మాగాణి భూమి మూడు ఎకరాల లోపు, మెట్ట భూమి 10 ఎకరాల లోపు, విద్యుత్ వాడకం నెలకు 300 యూనిట్లకు లోపు, ప్రభుత్వ ఉద్యోగి, ప్రభుత్వం నుంచి పెన్షన్ తీసుకుంటున్న వారు, ఇన్‌కంట్యాక్స్ చెల్లించేవారు, నాలుగు చక్రాల వాహనాలు ఉన్నవారు అర్హులు కాదని అధికారులు తేల్చి చెప్పారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్వో నరసింహులు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన పరీక్షల నిర్వాహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు 64 కేంద్రాల్లో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మొత్తం 30,182 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఇంటర్ మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ఉంటాయన్నారు.

అక్రమ సోదాలు అన్యాయం

- చిత్తూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఏపీడబ్ల్యూజేఎఫ్ ధర్నా



చిత్తూరులో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో పోలీసులు అక్రమ సోదాలు అన్యాయమని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు మండిపడ్డారు. ఆ సంఘం నాయకులు శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి ప్రకాష్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా పలు పత్రికా కార్యాలయాలు, పాత్రికేయులపై అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు దాడులకు తెగబడుతున్నారని దుయ్యబట్టారు. గతంలో ఎన్నడూ లేని విధానాలు ప్రస్తుతం అమలు చేయడం దారుణమన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు జయరాజ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ విధులు నిర్వహిస్తున్న పాత్రికేయులకు రక్షణ లేకుండా పోతోందన్నారు. కలంపై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిదన్నారు. ఆ విషయం తెలిసినప్పటికీ పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు తమ పరిమితులను దాటి ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. తాజాగా సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లోకి అక్రమంగా చొరబడి ఏకపక్షంగా సోదాలు చేయడం దారుణమన్నారు. ఇలాంటి చర్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో ఏపీడబ్ల్యూజేఎఫ్ సంఘ నాయకులు కృపానందరెడ్డి, యాదవేంద్రరెడ్డి, హరిప్రసాద్, కేశవులు, బాలసుబ్రహ్మణ్యం, ఉమాశంకర్, కుపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులు అనైతికం

పుంగనూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం పరిపాటిగా మారిందని, ఇది అనైతికమని పాత్రికేయులు ఆరోపించారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో అక్రమ తనిఖీలను ఖండిస్తూ శుక్రవారం పుంగనూరులో ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు నిరసన తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ప్రభుత్వ లోపాలను సాక్షి దినపత్రికలో ప్రచురిస్తుండడాన్ని జీర్ణించుకోలేక ప్రభుత్వం సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా సోదాలు చేయడం బాధకరమన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ సైపుల్లా, నియోజకవర్గ అధ్యక్షుడు సతీష్‌కుమార్, ఎన్.రసూల్, మద్రిబాబు, కోటారెడ్డి ప్రసాద్, జగదీష్, కృష్ణమూర్తి, రెడ్డెప్ప, జావీద్, పురుషోత్తం, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరులో తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టులపై దాడులు మానుకోవాలి

చౌడేపల్లి: కూటమి ప్రభుత్వం జర్నలిస్టులపై దాడులు మానుకోవాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు నాగరాజ, రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో అక్రమంగా సోదాలు చేయడం తగదన్నారు. జర్నలిస్టులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ భార్గవికు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రసూల్, సుబ్రమణ్యం సింగ్, మురళి, హరిప్రసాద్, శ్రీనివాసులు, చిన్నా, రమేష్, వెంకటేష్, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్సవాల ఆరంభంలో అపశ్రుతి

- విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి


మృతి చెందిన శ్రీను

చిల్లకూరు: గూడూరు పట్టణం, కర్ణాలవీధి ప్రాంతంలోని ఆలయం వద్ద ఉత్సవాలను ఆరంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో శుక్రవారం అపశ్రుతి దొర్లింది. ఉత్సవాల ఏర్పాట్లలో ఉన్న కూలీ గూడూరు పట్టణ సమీపంలోని గిరిజన కాలనీకి చెందిన శ్రీను(18) 11కేవీ విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

దొరవారిసత్రం: చెన్నై వైపు వెళ్తున్న రైలు నుంచి జారి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన అక్కరపాక గ్రామ సమీపంలోని అండర్ పాస్ బ్రిడ్జికి సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, సూళ్లూరుపేట జీఆర్పీ పోలీసుల కథనం.. ఆఫ్‌లైన్ పట్టాలపై చెన్నై వైపు వెళ్తున్న సిల్చార్–కోయంబత్తూరు ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి గుర్తుతెలియని 30–35 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. తీవ్ర గాయాలపాలైన అతన్ని 108 సిబ్బంది చికిత్స నిమిత్తం సూళ్లూరుపేటకు తరలిస్తుండగా.. మార్గమధ్యంలోనే మృతిచెందాడు. మృతుడు వద్ద ఉన్న టికెట్ ఆధారంగా అస్సాం రాష్ట్రం కచార్ జిల్లాలోని సిల్చార్ ప్రాంతం నుంచి తమిళనాడు రాష్ట్రంలోని ఖాట్పాడికి వెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు.

అడవికి నిప్పు

చిట్టమూరు: గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రిజర్వు ఫారెస్టులో సాగుచేస్తున్న జామాయిల్ చెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని చిల్లమూరు పంచాయతీ, కలగుర్తిపాడు గ్రామ సమీపంలోని రిజర్వు ఫారెస్టులో సుమారు 200 ఎకరాల వరకు జామాయిల్‌ను అటవీ శాఖ ఆధ్వర్యంలో సాగుచేస్తున్నారు. బాగా ఏపుగా చెట్లు పెరిగి ఉండడంతో ఆకులు రాలి కింద పడి ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు ఆకులకు నిప్పు పెట్టడంతో మంటలంటుకున్నాయి. స్థానికులు నాయుడుపేట డీఆర్ఓ కోటీశ్వరరావుకి సమాచారం ఇవ్వడంతో ఆయన అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. మంటలు అదుపు చేసేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి


హాజరైన వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు


అందరూ గుర్తున్నారు.. ఏదీ మర్చిపోను!

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బంది పెడితే వదిలి పెట్టం
- అధికారులను కూడా విడిచిపెట్టే ప్రసక్తే లేదు
- పేదల పక్షాన నిలబడినందుకు నా పైనే అక్రమ కేసులు
- భవిష్యత్‌లో దీనికి తగిన మూల్యం తప్పదు
- జగనన్న 2.0 చూస్తారు
- మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: 'అందరూ గుర్తున్నారు.. అన్ని గుర్తున్నాయి.. ఏదీ మర్చిపోను.. వైఎస్ఆర్‌సీపీ నాయకులను అన్యాయంగా ఇబ్బంది పెడుతున్నారు. పేదల పక్షాన నిలుస్తున్న నాపైనే టీడీపీ అక్రమ కేసులు బనాయిస్తోంది. భవిష్యత్‌లో ఇందుకు బాధ్యులైన అధికారులు కూడా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు' అని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండల నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికల వరకే ప్రత్యర్థులు.. ఆ తర్వాత ఎవరికి ఏ అవసరం వచ్చినా సహాయం చేసినట్టు గుర్తుచేశారు. టీడీపీలో ఉన్న వారు కూడా ఎంతో సహాయం పొందారన్నారు. కానీ నేడు శ్రీకాళహస్తిలో ఆ పరిస్థితి లేదని వాపోయారు. ఇంకా ఏమన్నారంటే..

విష సంస్కృతికి బీజం

శ్రీకాళహస్తి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒక కొత్త సంప్రదాయానికి టీడీపీ నాంది పలికింది. రైతుల పొలాలను దున్నేయడం, టేకు చెట్లు కాల్చేయడం, విలేకరుల పై దాడి చేయడం, ప్రశ్నిస్తున్న వారిపై కేసులు, చిత్రహింసలకు గురిచేయడం చూస్తున్నాం.

అన్న చెప్పమన్నారు!

ఇటీవల మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసినప్పుడు నియోజకవర్గ విషయాల గురించి అడిగారు. ఇక్కడ జరుగుతున్న దౌర్జన్యాలు, ఆగడాలు, అరాచకాలను వివరించా. కార్యకర్తలను ధైర్యంగా ఉండమని చెప్పమన్నారు. మనం అధికారంలోకి రాగానే మన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కర్నీ విడిచి పెట్టే ప్రసక్తే లేదని చెప్పమన్నారన్నారు.

ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి, తొట్టంబేడు మండల అధ్యక్షుడు ఉన్నం వాసుదేవ నాయుడు, తొట్టంబేడు మండల వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనారు.

నమ్మి మోసపోయామన్నా!

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఈ మధ్య చాలా మంది ప్రజలు నాతో అన్న మాట ఒక్కటే. జగనన్న అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమ పథకాల ద్వారా వచ్చే డబ్బుతో ఎంతో సంతోషంగా ఉండేవాళ్లం. . కానీ నేడు చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితి లేదు.. అని చాలా బాధపడుతున్నారు. అలాగే వారు చెప్పిన ఇంకో మాట అత్యాశకు వెళ్లి నమ్మి మోసపోయామని, కానీ గతంలో జగనన్న మా ఇంట్లో మనిషి లాగా మా అందర్నీ ఆదుకున్నాడని అంటున్నారు. ప్రజల్లో మార్పు మొదలైంది. దీన్ని ఎవరూ ఆపలేరు.

జగనన్న 2.0 చూపిస్తాం

ఈసారి జగనన్న 2.0 చూస్తారన్నారు. కార్యకర్తలు, నాయకులకు ఒక విజ్ఞప్తి చేస్తున్నా. మీపై తప్పుడు కేసులు పెట్టడానికి ఎవరైనా మీకు ఫోన్ చేసినా లేదా పోలీస్ స్టేషన్‌కి రమ్మన్నా.. ప్రతి ఒక్కటీ రికార్డ్ చేయండి. మిమ్మల్ని ఇబ్బంది పెట్టిన ఏ అధికారినీ విడిచి పెట్టేది లేదు. మీ అందరికీ తోడుగా నేనుంటాను.

కేసులకు జగనన్న సైన్యం భయపడదు

పేద ప్రజల పక్షాన నిలబడినందుకు నాపైనే కేసులు నమోదు చేశారు. కానీ మీరు పెట్టే కేసులకు నేను భయపడను. నన్ను నమ్ముకున్న వారిని మీరు ఇబ్బంది పెట్టాలని చూస్తే దానికి తగిన మూల్యం చెల్లించుకుంటారు. సంబంధం లేకుండా మా నాయకులను కేసుల్లో ఇరికించి స్టేషన్ల చుట్టూ తిప్పుకుంటున్నారు. ఈ సంప్రదాయాన్ని ఇలాగే కొనసాగిస్తే రేపు నేను ఆపిన మా కార్యకర్తలు ఎవ్వరూ ఆగరు. తరవాత మీ ఇష్టం. మీరు కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే జగనన్న సైన్యం భయపడదని స్పష్టం చేశారు.

దిగజారుడు రాజకీయం తెలియదు

బొజ్జల కుటుంబం ఎప్పటికీ ప్రత్యర్థులే. ఈ మధ్య నేను వారితో కలిసి పోయానని కొందరు పుకార్లు లేపుతున్నారు. కానీ వారందరికీ ఒకటే చెప్తున్నా వ్యక్తిత్వాన్ని అమ్ముకొని దిగజారిపోయి బతికే మనిషి మీ మధుసూదన్ రెడ్డి కాదు.

జూనియర్ సివిల్ జడ్జిలకు
వేసవి సెలవులు

తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు ఈనెల 19 నుంచి జూన్ 12వ తేదీ వరకు వేసవి సెలవులు ఉండడంతో జడ్జిలు వేసవి సెలవులపై వెళ్లడానికి 12 రోజులు చొప్పున సెలవులు మంజూరు చేస్తూ జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈనెల 19 నుంచి 30వ తేదీ వరకు చిత్తూరు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.మాధవి, చిత్తూరు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి బీ.శిరీషా, చిత్తూరు 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీ.వెన్నెల, చిత్తూరు ఎక్సైజ్ కోర్టు జడ్జి వీ.శిల్ప, మదనపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బీ.సుభాన్, తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బీ.వాణిశ్రీ, తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీ.కోటేశ్వరరావు, తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీకాంత్, పీలేరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్, శ్రీకాళహస్తి జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ, పుంగనూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కే.కృష్ణవంశీ, పుత్తూరు జూనియర్ సివిల్ జడ్జి కే.రమ్యసాయి, వాయల్పాడు జూనియర్ సివిల్ జడ్జి గురుఅరవింద్, సత్యవేడు జూనియర్ సివిల్ జడ్జి ఏ.వెంకటనాగరాజు సెలవుపై వెళ్లనున్నారు. అలాగే జూన్ ఒకటి నుంచి 12వ తేదీ వరకు చిత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డీ.ఉమాదేవి, చిత్తూరు నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి షేక్ బాబాజాన్, మదనపల్లి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జే.కీర్తన, తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సత్యకాంత్‌కుమార్, తిరుపతి మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం. సంధ్యారాణి, తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధిశ్రీనివాస్, పుత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీ.జానకి, తంబళ్లపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఉమర్ ఫరూక్, పాకాల జూనియర్ సివిల్ జడ్జి పీ. పూర్ణిమాదేవి, పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి ఎం.లిఖిత్, కుప్పం జూనియర్ సివిల్ జడ్జి పీ.వరుణ్ తేజ్ సెలవు పై వెళ్లడానికి జిల్లా కోర్టు అనుమతిచ్చింది.

భూసేకరణ పనులు వేగవంతం

తిరుపతి అర్బన్: వైజాగ్–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలసి కలెక్టర్ వర్చువల్ పద్ధతిలో అధికారులతో సమీక్షించారు. ఏపీఐఐసీతోపాటు రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు సమిష్టిగా కారిడార్ పనులకు చెందిన భూముల సేకరణ చేపట్టాలన్నారు. వచ్చే వారానికి భూసేకరణలో పురోగతి చూపాలని స్పష్టం చేశారు. గూడురు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, తిరుపతి ఆర్డీవోలు రాఘువేంద్రమీనా, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, రామమోహన్, ఏపీఐఐసీ జిల్లా జోనల్ మేనేజర్ విజయభరత్‌రెడ్డి, నెల్లూరు జోనల్ మేనేజర్ శివకుమార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ మధుసూదన్‌రావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

తుడా టవర్స్ ఈ వేలంలో రూ.62.57 కోట్లు


మాట్లాడుతున్న మౌర్య

తిరుపతి తుడా: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఐకానిక్ టవర్స్‌కు రెండు విడతల్లో ఈ వేలం నిర్వహించగా ఇప్పటి వరకు రూ.62.57 కోట్లకు విక్రయాలు జరిగాయని ఆ సంస్థ వైస్ చైర్మన్ ఎన్.మౌర్య తెలిపారు. తుడా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తుడా టవర్స్‌లో కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారని ఆమె చెప్పారు. ఇప్పటి వరకు 24 రెసిడెన్షియల్ ప్లాట్లు, 5 వాణిజ్య ప్లాట్లు ఈ–వేలం ద్వారా విక్రయించామన్నారు. వీటి ద్వారా రూ.62.57 కోట్ల ఆదాయం చేకూరినట్టు పేర్కొన్నారు. ఇందులో తొలి విడతగా 20 శాతం తుడా ఖాతాలోకి జమైందన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తున్న టీడీఆర్ మేళాలో 557 బాండ్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు 107 బాండ్లు జారీచేశామన్నారు. మరో 239 గిఫ్ట్ డీడ్ ఇచ్చి అప్రూవల్ కు సిద్ధంగా ఉన్నాయన్నారు. 140 ఆస్తులు మాత్రం కోర్టు వివాదాల్లో ఉన్నాయని తెలిపారు. 68 ఆస్తులకు యజమానుల వివరాలు సేకరించే పనిలో ఉన్నామన్నారు. టౌన్ క్లబ్ స్థలం పట్టా అని తేలిందని, దానికి కూడా టీడీఆర్ ఇస్తామన్నారు. అందరి సమన్వయంతో జాతరను జయప్రదం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

హోమ్ స్టేలపై దాడులు

తిరుపతి అర్బన్: తిరుపతిలో అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్న హోమ్‌స్టేలపై రెండు రోజులుగా వాణిజ్యపన్నుల శాఖ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్సన్ నేతృత్వంలో దాడులు సాగుతున్నాయి. ఇప్పటికే హోమ్ స్టే వ్యాపారాలు చేస్తున్న వారికి వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని అవగాహన కల్పించారు. అయినా వారు రిజిస్ట్రేషన్లు చేసుకోకుండానే వ్యాపారం చేయడాన్ని తప్పుబట్టారు. తిరుపతి–తిరుమల నేపథ్యంలో పలువురు టూరిస్టులు విచ్చేస్తున్న క్రమంలో తిరుపతిలో అనేక హోటల్స్ ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారులు చేస్తున్న వారు తప్పకుండా అనుమతులు పొందాలని సూచించారు. లేదంటే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

ఘనంగా 60 ఏళ్ల వివాహ వేడుక


జయరామిరెడ్డి దంపతుల 60 ఏళ్ల వివాహ వార్షికోత్సవంలో కుటుంబ సభ్యులు

తిరుపతి కల్చరల్: బైనగారి జయరామిరెడ్డి, లక్ష్మీదేవి దంపతుల 60 ఏళ్ల వివాహ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఓ ప్రయివేటు హోటల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఏర్పేడు మండలం, పాపానాయుడుపేట, చెన్నంపల్లి గ్రామానికి చెందిన జయరామిరెడ్డి ప్రధానోపాధ్యాయులుగా పల్లం, సంతవేలూరు, చింతపర్తి, పెరుమాళ్లపల్లి, అక్కుర్తి గ్రామాల్లో విధులు నిర్వహించారు. ఎందరో విద్యార్థుల ఉజ్వల భవితకు దోహదపడ్డారు. కుటుంబ సభ్యులు ఆయన 60 ఏళ్ల వివాహ వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. జయరామిరెడ్డి దంపతుల కుమారులు విజయశేఖర్‌రెడ్డి, భరత్‌భూషణ్‌రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, కుమార్తె సౌజన్య, మబ్బు బాలక్రిష్ణారెడ్డి, ఎంవీ.సాయిప్రసాద్, రాజశేఖర్, రిటైర్డ్ లెక్చరర్ క్రిష్ణారెడ్డి, బంధువులు, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విమానాశ్రయ భద్రతపై సమీక్ష


విమానాశ్రయంలో సమావేశమైన అధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): ఇండియా–పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో శుక్రవారం తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి విమానాశ్రయ అధికారులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం అమలు చేస్తున్న భద్రతా చర్యలపై, రాబోయే రోజుల్లో తీసుకోవాల్సిన భద్రతా విషయాలపై చర్చించారు.

వారెంట్‌పై ముద్దాయి

తిరుపతి లీగల్: ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తమిళనాడు, తిరువణ్ణామలై జిల్లా, జమన ముర్త్ ఊరు తాలూకా, పుదుపట్టుకు చెందిన ఎం.విజయ్‌కుమార్‌ను తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఫారెస్ట్ సిబ్బంది శుక్రవారం నాన్ బెయిలబుల్ వారెంట్ పై కోర్టులో హాజరు పరిచారు. నిందితుడు విజయ్‌కుమార్‌కు తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. వివరాలు.. 2018 ఆగస్టు 23వ తేదీ ఎస్‌వీఎన్‌పీ చామల రేంజ్, నాగపట్ల ఈస్ట్ బీట్, కరివి పాకులకోన, శేషాచలం అటవీ ప్రాంతంలోకి నిందితుడు విజయ్‌కుమార్ ఇతరులతో కలిసి అక్రమంగా మారణాయుధాలతో ప్రవేశించి ఎర్రచందనం చెట్లను నరకడానికి యత్నించాడు. తిరుపతి టాస్క్ ఫోర్స్ ఫారెస్ట్ సిబ్బంది నిందితుడిను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచారు. నేరం అతనిపై రుజువు కావడంతో న్యాయమూర్తి అతనికి ఐదేళ్లు జైలు శిక్ష, రూ.3లక్షల జరిమానా విధిస్తూ గత నెల 22వ తేదీ తీర్పు చెప్పారు. అయితే నిందితుడు తీర్పు చెప్పే రోజు కోర్టుకు హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి అతనిని వారెంట్ పై హాజరుపరచాలని ఫారెస్ట్ సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది శుక్రవారం నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి శిక్షను అమలు చేస్తూ నెల్లూరు జైలుకు అతన్ని తరలించాలని ఉత్తర్వులు జారీచేశారు

వెకేషన్ కోర్టు షెడ్యూల్ విడుదల

తిరుపతి లీగల్: సివిల్ కోర్టులకు ఈనెల 12 నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానుండడంతో అత్యవసర కేసులను దాఖలు చేసుకోవడానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వెకేషన్ కోర్టు విధులు షెడ్యూల్ ను వెకేషన్ సివిల్ జడ్జి, మదనపల్లి రెండవ అదనపు జిల్లా జడ్జి పీ.వీఎస్ సూర్యనారాయణమూర్తి శుక్రవారం విడుదల చేశారు. ఈనెల 13, 20, 28 తేదీల్లో చిత్తూరులోనూ, ఈనెల 15, 22 తేదీల్లో తిరుపతిలోనూ, ఈనెల 12, 19, 27 తేదీల్లో మదనపల్లిలోనూ, ఈనెల 14, 21, 26 తేదీల్లో పీలేరులోనూ, ఈనెల 16, 23 తేదీల్లో శ్రీకాళహస్తిలోనూ వెకేషన్ కోర్టు విధులు నిర్వహిస్తుందని జడ్జి షెడ్యూల్లో పేర్కొన్నారు.

లోక్ అదాలత్ వాయిదా

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం జరగాల్సిన జాతీయ లోక్‌అదాలత్‌ను అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎంఎస్.భారతి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌ను జూలై 5వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కక్షిదారులు సహకరించాలని కోరారు.

తమ్ముడు మందలించాడనీ..!

- అలిగి వెళ్లిన అక్క

తిరుపతి క్రైమ్: తమ్ముడు మందలించాడని అక్క ఇంట్లో నుంచి అలిగి వెళ్లిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈస్ట్ పోలీసుల కథనం.. నగరంలోని సుభాష్‌నగర్‌కి చెందిన ఓ బాలిక ఇంటర్మీడియెట్ చదువుతోంది. ఇంట్లో ఫోన్‌లో ఇన్‌స్టాగామ్ వాడుతున్న సమయంలో బాలిక తమ్ముడు యుగంధర్ బాబు ఫోన్ ఎక్కువ వాడొద్దని మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన అక్క ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో అలిగి వెళ్లింది. కేసు దర్యాప్తులో ఉంది.

టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ పై కేసు

తిరుపతి క్రైం : నగరంలోని రెడ్ శాండిల్ టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐగా పనిచేస్తున్న విశ్వనాథ్‌పై శుక్రవారం అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ లోకేష్ తెలిపిన వివరాల మేరకు.. సత్యనారాయణపురంలో నివాసం ఉంటున్న ఓ మహిళ వెంట పడుతూ ఆమెను వేధిస్తున్నట్లుగా ఫిర్యాదు రావడంతో అతనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.